కోలాహలంగా పోలేరమ్మ జాతర

నాయుడుపేటటౌన్: గ్రామదేవత పోలేరమ్మ జాతర మంగళవారం కోలాహలంగా జరిగింది. జాతరలో భాగంగా పోలేరమ్మ ఆలయం వద్ద భక్తులు అంబళ్లు పోసి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సమీపంలో పోలేరమ్మ ప్రతిమను ప్రతిష్ఠించే పీఠంతోపాటు పోలేరమ్మ చావడి వద్ద పూజలను నిర్వహించారు. ఈఓ పాయసం శాంతరావు ఆలయ కమిటీ చైర్మన్ గంధవల్లి సిద్దయ్య, సభ్యులు జాతరలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. పిల్లలు ఇంటింటికీ వెళ్లి మడి భిక్షం సేకరించారు. రాత్రి పడమటి వీధిలోని అంకాలమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పోలేరమ్మ ప్రతిమను మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ప్రధానవీధుల్లో ఊరేగించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, జాతర నిర్వాహకులు గాదిరెడ్డి గోపి, బీఎల్ శ్రీనివాసులు, గంధవల్లి భరత్, దేవత చెంచు కిషోర్ శెట్టి, పసల హరిబాబు, కాలగంధ సునీల్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



అంబళ్లు తెస్తున్న భక్తులు



పూజలు చేస్తున్న కమిషనర్, ఆలయ చైర్మన్

229 మంది పోలీసులతో బందోబస్తు

పోలేరమ్మ జాతరలో 229 మందితో పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. జాతర బందోబస్తుకు నాయుడుపేట, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన పోలీసులతో డీఎస్పీ పోలేరమ్మ ఆలయం సమీపంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ సీఐలు నరసింహారావు, వైవీ సోమయ్యతోపాటు సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి సీఐలు, 15 మంది ఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, మహిళ కానిస్టేబుళ్లు, ఏఆర్ కానిస్టేబుళ్లు, స్పెషల్ పార్టీ పోలీసులు టీమ్‌లుగా మొత్తం 229 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా పేర్నాటి జన్మదినం



కోట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం కోటలో ఆయన అభిమానులు, ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. శ్యాంప్రసాద్‌రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో పార్టీ కార్యకర్తలు, యువకులు మొత్తం 226 మంది రక్తదానం చేశారు. గూడూరు ఏరియా హాస్పిటల్,నోవా బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించినట్లు డాక్టర్ సందీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట వైస్ ఎంపీపీ శేషయ్య, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ నరమాల రమణయ్య, రమణారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రసాద్‌గౌడ్, రాధాకృష్ణారెడ్డి, సాయిరెడ్డి, చంద్రభూషణ్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, గురుస్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

చిట్టమూరు: మండలంలోని తాడిమేడు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం మోటర్ సైకిల్ అదుపు తప్పి పడడంతో ఇద్దరు గాయపడినట్లు ఎస్‌ఐ లక్ష్మీభవాని తెలిపారు. ఈశ్వరవాక గ్రామానికి చెందిన సుధాకర్, శంకర్ మోటర్ సైకిల్‌పై కొత్తగుంట గ్రామానికి వచ్చి, తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా తాడిమేడు క్రాస్ రోడ్డు వద్ద వాకింగ్‌కు వెళుతున్న వారిని ఢీ కొని, మోటర్ సైకిల్ అదుపు తప్పి, పడ్డారు. ఈ ఘటనలో బైక్‌పై వెళుతున్న ఇద్దరికీ గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



సైదాపురం: మండలంలోని గిద్దలూరులో మంగళవారం విద్యుత్ స్తంభాన్ని కారు ఢీ కొంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని గిద్దలూరు గ్రామానికి చెందిన కుంచం గురవయ్య నెల్లూరు నుంచి తన స్నేహితుడి కారును తీసుకుని స్వగ్రామమైన గిద్దలూరులోని తూర్పువీధిలో వెళుతూ ఎల్‌టీ లైన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. దీంతో విద్యుత్ స్తంభం కారుపై కూలి, ఒక్కసారిగా నిప్పు రవ్వలు రాలాయి. అయి ఫీజులు పోవడంతోపాటు ఆ ప్రాంతంలో ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

కలసికట్టుగా పనిచేస్తాం

నాయుడుపేట: పార్టీలకతీతంగా అందరం కలసికట్టుగా ఉంటూ మేనకూరు సెజ్ పరిధిలోని అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ రెడ్డి అన్నారు. మేనకూరు సెజ్ పరిధిలోని ఇండూస్ కాఫీ పరిశ్రమ యాజమాన్య ప్రతినిధుల సౌజన్యంతో సుమారు రూ.30 లక్షల సీఎస్సార్ నిధులతో కోనేటి రాజుపాళెం గ్రామ ప్రజలకు శుద్ధి నీటి ప్లాంట్, ద్వారకాపురం వద్ద బస్ షల్టర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇండూస్ పరిశ్రమ డైరెక్టర్ ఎస్ రవిగౌడ, గ్రీన్‌టెక్ ఆటో మొబైల్స్ పరిశ్రమ సీఈఓ త్రీబుల్‌సీ, జెడ్పీటీసీ సభ్యులు కట్టా జ్యోతి రెడ్డి, మేనకూరు, ద్వారకపురం సర్పంచ్‌లు సురేష్, లావణ్య, ఎంపీటీసీ సభ్యుడు కేశవులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

వెంకటగిరిరూరల్: వంట చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని జంగాలపల్లి పంచాయతీ వైఎస్ అగ్రహారంలో మంగళవారం రాత్రి చోటుచేకుంది. అగ్నిమాపక అధికారులు, స్థానికుల కథనం మేరకు.. వైఎస్ అగ్రహారానికి చెందిన పెనుబాకు ఈశ్వరయ్య ఇంట్లో రాత్రి వంట చేస్తున్న సమయంలో గ్యాస్ స్టౌ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాప్తించడంతో గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. దీంతో ఇంటికి నిప్పంటుకుంది. అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. అయితే అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో నగదు, బంగారు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పలు సర్టిఫికెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షలు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు. బాధితుడు ఈశ్వరయ్య గాయపడడంతో వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రజల వద్దకే పాలన ఘనత జగనన్నదే

ఓజిలి: ప్రజల వద్దకే సంక్షేమ పాలనను తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, రానున్న ఎన్నికల్లో తిరిగి ఆయన్ని గెలిపించుకుందామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మంగళవారం మండలంలోని భువనగిరిపాళెం, పెదపరియ, పెదపరియ రాచపాళెం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు భిన్నంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత నిచ్చి అభివృద్ధి చేస్తున్నారన్నారు. భవిష్యత్తు తరాల భాగోగులపై పూర్తిస్థాయి అవగాహనతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ప్రజల్లో సీఎంకు పెరుగుతున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ, సీసీ రోడ్లు, బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జీ రవీంద్రరాజు, జేసీఎస్ కన్వీనర్ షేక్ ఖాదర్‌బాషా, ఏఎంసీ డైరెక్టర్ బట్టికాయల కృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యుడు ఎం ప్రసాద్‌రాజు, సర్పంచ్‌లు చల్లా హంసవేణి, గోవిందు సుధ, నాయకులు ఆదిరామయ్య, ఎం పోలయ్య, సురేష్, వెంకటరమణరాజు, డీ పోలయ్య, డి దామోదర్‌రాజు, వై రాంప్రసాద్ రాజు, కే రామూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.



భువనగిరిపాళెంలో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

అన్ని హంగులతో టవర్ క్లాక్ సెంటర్

గూడూరు: పట్టణానికి ఐకాన్ లాంటి టవర్ క్లాక్ సెంటర్‌ను అన్ని హంగులతో అధునాతనంగా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద నిర్మాణ దశలో ఉన్న టవర్ క్లాక్ సెంటర్ నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గూడూరు ప్రజలు తనను ఎంతో ఆదరించారని, వారికి తనవంతు సాయంగా తన సొంత నిధులతో టవర్ క్లాక్ సెంటర్ ఏర్పాటు చేసి, వారికి అంకితం ఇస్తానన్నారు.

డంపింగ్ యార్డు తరలింపు పనుల పరిశీలన

పట్టణ సమీపంలోని డంపింగ్ యార్డులో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు కమిషనర్ సాయినాథ్‌తో కలసి మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డు తరలింపు పనులను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పానకా దేవసేనమ్మ, ఆమె భర్త పానకా శివకుమార్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో కమిషనర్ సాయినాథ్, పట్టణ సీఐ హజరత్ బాబు, నరసయ్య, మురళి, అల్తాఫ్, బాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా చండీ యాగం

గూడూరు: పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం చండీయాగం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీబొమ్మ కూడలిలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా ఈ యాగం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



చండీ యాగం చేస్తున్న అర్చకులు

వైభవంగా తిరుచ్చి ఉత్సవం

చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి తిరుచ్చి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కరణాల వీధిలో ఉన్న చెన్నకేశవ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. రాత్రి హంస వాహనంపై స్వామివారిని కన్నుల పండువగా ఊరేగించారు.

పాలిటెక్నిక్ కోర్సుతో ఉద్యోగాలు

గూడూరు: పాలిటెక్నికల్ కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని జెడ్పీటీసీ సభ్యురాలు యామిని అన్నారు. మంగళవారం ప్రభుత్వ సిరామిక్ కళాశాలలో ఉద్యోగ సాధకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.

ఆక్రమణల తొలగింపుపై రాజీ లేదు

కోట: పట్టణంలో ఆక్రమణల తొలగింపు విషయంలో రాజీ పడేది లేదని ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. కోట బజారువీధిలోని వ్యాపారులతో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ డీఈఈ అరుణమ్మ, ఎంపీడీఓ భవానీ, ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేక వేడుకలు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): మండలంలోని పిగిలాం కొత్తపాళెం దళితవాడలో నూతనంగా నిర్మించిన చెంగాళమ్మతల్లి, పోలేరమ్మతల్లి ఆలయాల కుంభాభిషేక వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన పోలేరమ్మతల్లి, చెంగాళమ్మతల్లి ఆలయాల్లో 40 రోజులు ప్రత్యేక హోమాలు చేసి, మంగళవారం అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు.భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

చిట్టమూరు: మండలంలోని చిన్నదరఖాస్తు గ్రామ దేవత ఎల్లసీరమ్మ ఆలయ మహా కుంభాభిషేక వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. కలశారాధన, గణపతి హోమం, నవగ్రహ హోమం, ఎల్లసీరమ్మ మూలమంత్ర హోమాలు నిర్వహించారు.



చెంగాళమ్మకు పూజలు చేస్తున్న అర్చకుడు

శేషుడిపై లక్ష్మీనరసింహుడు

చిల్లకూరు: మండలంలోని కలవకొండ సమీపంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు మంగళవారం ఉదయం తిరుచ్చి, సాయంత్రం శేషవాహనంపై విహరించారు. ఉదయం సుప్రభాతసేవ, వేద ప్రబంధపారాయణం, చతుస్థాన అర్చన లఘుపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు, తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తరువాత ధ్వజారోహణం జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు శేష వాహనం ఊరేగారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈఓ నవీన్‌కుమార్, చైర్మన్ కందల ఆనంద్‌బాబు, పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు.



పత్రికా సేచ్ఛను కాపాడాలి



సైకత శిల్పాన్ని రూపొందిస్తున్న సనత్‌కుమార్

చిల్లకూరు: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే పత్రికలకు ఉండే స్వేచ్ఛను ప్రతిఒక్కరూ కాపాడాలని సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ ఆకాంక్షించారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సముద్ర తీర ప్రాంతంలో పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కాంక్షిస్తూ సైకత శిల్పాన్ని రూపొందించారు.